'సిద్ధార్థ'లో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 23: జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట, భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో సైన్స్ ఎక్స్‌పో పేరిట నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నది. ముందుగా ఎగ్జిబిషన్‌ను విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులందరూ సామాన్య శాస్త్ర పాఠ్య పుస్తకంలోని ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. ఇందులో సోలార్ సిస్టమ్, ఎర్త్ క్వేక్ అలారం సిస్టమ్, ఆవర్తన పట్టిక, జంతు కణం, మానవ జీర్ణవ్యవస్థ, స్మార్ట్ ఫామింగ్, గ్లోబల్ వార్మింగ్, డయాబెటిక్ టెస్టు, పెరిస్కోప్, టెలిస్కోప్ వంటి ప్రదర్శనలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, సైన్స్ జీవితంలో ఒక భాగమని, విజ్ఞానశాస్త్రంలో కొత్త అంశాలు నేర్చుకుంటూ దానికి అనుగుణంగా మన మేధస్సు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులందరూ గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ దాసరి స్వప్నా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించడం ద్వారా సులువుగా అవగాహన అవుతుందని, విద్యార్థుల్లో ఆలోచనా స్థాయి మెరుగుపడుతుందని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న శ్రీపాల్ రెడ్డి

హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చుక్కా లక్ష్మీబాయి సైన్స్‌టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో ర్యాంకులు సాధించిన ఎస్సీఆర్ పాఠశాల విద్యార్థులు

జలం.. పాతాళం

- జిల్లాలో మోగుతున్న ప్రమాద ఘంటికలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కేసీఆర్ హయాంలో నడి ఎండల్లోనూ నిండుకుండల్లా జలాశయాలు

వేసవికి ముందే జిల్లాలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఫిబ్రవరిలోనే ఓవైపు తాగునీరు, మరోవైపు సాగునీటి ఎద్దడి మొదలైంది. శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో జిల్లా ప్రజానీకం పరేషానవుతున్నది. ఆయకట్టు, ఆయకట్టేతర మండలాల్లో కూడా పరిస్థితులు ఒకే విధంగా ఉండడంతో, నడిఎండల్లో నీటి లభ్యత ఎలా ఉంటుందోననే జిల్లావాసుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

కలెక్టరేట్, ఫిబ్రవరి 23: గతేడాదితో పోల్చితే జిల్లాలో సగటు నీటి నిల్వ మీటరుకు పైగా దిగువకు పడిపోయింది. రాబోయే రోజుల్లో మరింత అడుగంటే సూచనలు కనిపిస్తుండగా, తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడం తథ్యమనే అభిప్రాయాలు అధికారుల నుంచే వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది సమృద్ధిగానే వర్షాలు కురిసినా జలాన్ని ఒడిసిపట్టడంలో ప్రభుత్వ ఘోరవైఫల్యం వేసవిలో నీటి ఎద్దడితో స్పష్టమవుతున్నదనే విమర్శలు వస్తున్నాయి. ఏనెలకానెల తగ్గుతున్న భూగర్భజలాల గణాంకాలు ముమ్ముందు రాబోయే నీటి కొరతకు సంకేతాలవుతున్నా, పాలకులు, యంత్రాంగం చోద్యం చూస్తుండడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. రోజురోజుకూ తాగు, సాగునీటి అవసరాలు పెరుగుతుండగా, ఈవేసవిలో నీటి అవసరాలు మరింత పెరుగుతాయని అంచనావేస్తున్న యంత్రాంగం, ముందుచూపుతో వ్యవహరించకపోవడంతో ఏప్రిల్ వరకు సమస్య జటిలమయ్యే ఆస్కారమున్నట్లు స్పష్టమవుతున్నది.

చుక్క నీరు లేని నగునూర్ వాగు

ఎడారిని తలపిస్తున్న వాగులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 23: వేసవి ఆరంభం కాక ముందే ఎండల తీవ్రతకు కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని (గుండి) నగునూర్, ఇరుకుల్ల వాగులు ఎడారిని తలపిస్తున్నాయి. వాగులోని వ్యవసాయ బావుల్లోనూ నీరు అడుగంటడంతో సమీప ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. గంగాధర మండలం నారాయణపూర్ రిజ్వయర్ నుంచి గుండివాగు ద్వారా (నగునూర్, ఇరుకుల్లవాగు)లోకి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు.

శరవేగంగా దిగువకు..

గతేడాది డిసెంబర్‌లో జిల్లా సగటు నీటి మట్టం 6.12 మీటర్లు దిగువన ఉండగా, ఈఏడాది జనవరిలో 7.01 మీటర్లకు పడిపోయింది. అంటే నెలలోపే సగటున 0.89 మీటర్ల దిగువకు నీరు చేరడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. కేవలం నాలుగు మండలాల్లో మాత్రమే నీటి మట్టంలో తేడా లేకపోగా, మిగతా 11 మండలాల్లో నీటి మట్టం దిగువకు చేరుతున్నట్లు అధికారులు విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. స్వరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వరుసగా రెండో వేసవిలో కూడా నీటి ఎద్దడి సమస్య ఉమ్మడి రాష్ట్రంలో జిల్లావాసులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుకు తెచ్చేలా ఉందనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి. సీమాంధ్రుల పాలనలో కొన్నేళ్లపాటు యాసంగిలో క్రాప్ హాలీడేలు కూడా ప్రకటించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. రాబోయే రోజుల్లో తిరిగి అవి పునరావృతమవుతాయేమోననే ఆందోళన జిల్లా ప్రజానీకంలో నెలకొన్నది.

చొప్పదండి మండల పరిధిలోని ఓ వ్యవసాయ బావిలో అడుగంటిన భూగర్భ జలం

నాడు సుభిక్షం.. నేడు దుర్భిక్షం

తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉభయ గోదావరి జిల్లాలను తలపించగా, నడి ఎండాకాలంలో సైతం 'కాళేశ్వరం' జలాలు మెట్టప్రాంతాల ప్రజల కాళ్లు కడిగాయి. ఒక్క తడి కూడా తక్కువ కాకుండా యంత్రాంగం నీటి విడుదల చేసేలా చర్యలు తీసుకునేవారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జలాలను ముందుగానే ఎత్తిపోసి ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీటి నిల్వలు చేయడంపై కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టేది. దీంతో, భూగర్భ జలాలు పైకి ఉబికివచ్చి, వేసవిలో సైతం వ్యవసాయ బావుల్లో భూమికి మీటరు దిగువలోనే నీటి నిల్వలుండేవి. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనాపగ్గాలు చేపట్టిన అనంతరం సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేయడంపై చూపుతున్న నిర్లక్ష్యంతో జలం పాతాళానికి చేరిందనే చర్చ జిల్లాలో నడుస్తున్నది. ఈ క్రమంలో నీటి ఎద్దడి నివారణకు తీసుకునే ప్రత్యామ్నాయ చర్యల కోసం వేచిచూడాల్సిందేనని అధికారులే పేర్కొంటుండడం గమనార్హం.

ఎస్సీఆర్ విద్యార్థుల విజయకేతనం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 23: చుక్కా లక్ష్మీబాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో ఎస్సీఆర్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజయ కేతనం ఎగురవేశారని పాఠశాల ప్రిన్సిపాల్ కె. చుక్కారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో ఎస్సీఆర్ పాఠశాల విద్యార్థులు మెడవేని సృజన్‌తేజ (8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్, రెడ్డవేణి వినయ్ (9వ తరగతి) మూడో ర్యాంక్, ఆకారపు ప్రణవి (8వ తరగతి) నాలుగో ర్యాంకు, గర్షికుర్తి శ్రీనిధి (9వ తరగతి) ఐదో ర్యాంకు, ఈర్ల రిషి వర్ధన్ (6వ తరగతి) 10వ ర్యాంక్ సాధించారని వివరించారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎం. విజయమోహన్ రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ ఆర్. యాకయ్య, డైరెక్టర్లు డాక్టర్ పీఆర్ రాజేందర్, డాక్టర్ కె. శ్యాంసుందర్, డాక్టర్ జి. ప్రశాంత్, మేనేజింగ్ డైరెక్టర్ బి. ఉపేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ కె. చుక్కారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

విద్యానగర్, ఫిబ్రవరి 23: త్వరలో జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైనార్టీ పట్టభద్రులు, టీచర్స్ కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, మైనార్టీలను చిన్న చూపు చూస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ పాషా తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రులు, టీచర్స్ సమస్యలపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినా నేటికీ జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి విద్య వ్యాపారని, నిరుద్యోగుల సమస్యల కోసం ఏనాడూ ఆయన మాట్లాడింది, కొట్లాడింది లేదని ఘాటుగా విమర్శించారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, అందుకే పట్టభద్రులు, టీచర్స్ తమ ఓటుతో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్, జిల్లా అధ్యక్షుడు సమీపర వేజ్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ బషీరుద్దీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ తాజ్, సిద్దిక్ షాదాబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమీ యుల్లా అహ్మద్, కార్యదర్శి సాబీర్, ఉపాధ్యక్షుడు సైద్, ఫయాజ్ చిస్తీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతివ్వండి: హరికృష్ణ

కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : ఈనెల 27న జరుగనున్న ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలంటూ, బీఎస్‌పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఎంఐఎం నాయకులను కోరారు. తన ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి నగరంలోని దారుసలాంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్‌తో పాటు కార్యవర్గ ప్రతినిధులను కలిశారు. బడుగు, బలహీనవర్గాల ప్రతినిధిగా, నీతి, నిజాయితీతో పట్టభద్రులకు సేవ చేయాలనే సంకల్పంతో బరిలోకి దిగిన తనను గెలిపించేందుకు ఎంఐఎం నాయకులు సహకరించాలన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని, ఉర్దూ మీడియంలో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించేందుకు పోరాటం చేస్తానని, ఉర్దూ మీడియం విభాగంలో ఎస్సీ, ఎస్టీ పోస్టులను డిరిజర్వ్ చేసేందుకు ఎంఐఎం ఎమ్మెల్యేలతో కలిసి గళమెత్తుతానని వెల్లడించారు. కాగా, మద్దతు అంశాన్ని తమ పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లనున్నట్లు గులాం అహ్మద్ స్పష్టం చేశారు. హరికృష్ణ వెంట పలువురు పట్టభద్రులు ఉన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : ఓటరుగా నమోదైన పట్టభద్రులంతా తమ ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా.బొమ్మరబోయిన కేశవులు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కరీంనగర్‌లో పట్టభద్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాసనమండలి ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఓటు హక్కును విస్మరించకూడదన్నారు. కార్యక్రమంలో శాతవాహన క్రాంతి, వెంకన్న, లక్ష్మణ్, శ్రీను, రమేశ్‌తో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలి

బ్యాలెట్ పేపర్లు పరిశీలిస్తున్న ఆర్‌వో పమేలా సత్పతి

- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని, దానిపై ఉన్న హక్కులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు. పలువురు ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, వారిని అభినందించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే ఉద్యోగులు తమ ఓటు హక్కు ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకే ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సోమవారం కూడా ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయవచ్చని, ఓటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటింగ్ వివరాలను ఆర్డీవో కె.మహేశ్వర్, నోడల్ అధికారి శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ కూడా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. వారి వెంట ఉద్యానవన శాఖ డీడీ శ్రీనివాసరావు, యాదగిరి, ఇతర అధికారులు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : 2025-26 విద్యాసంవత్సరానికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రతిభా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు గురుకులాల్లో ప్రవేశాలు పొందేందుకు మొత్తం 3914 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికోసం వివిధ ప్రాంతాల్లో తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 96శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల జిల్లా సమన్వయకర్త జగన్నాథం తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు ముగిశాయని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

- ప్రవేశ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. జిల్లాకేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల, మైనార్టీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి పవన్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధికారులు లావణ్య, స్వాతి, మహేశ్‌తో పాటు పరీక్షల నిర్వహణ సిబ్బంది ఉన్నారు.

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 23: అలుగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 596 మంది విద్యార్థులకు గానూ 580 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పరీక్ష నిర్వహణను అడిషనల్ సెక్రటరీ టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఐఈఎస్ కిరణ్మయి, అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ పరిశీలించారు.

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 23: దేవంపల్లి గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షకు 3,914 మంది విద్యార్థులకు గానూ 96 శాతం హాజరైనట్లు జిల్లా కో ఆర్డినేటర్ ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం తెలిపారు. కాగా, పరీక్ష ముగిసిన వెంటనే విద్యార్థులు ఒక్కసారిగా బయటకు రావడం, వారి తల్లిదండ్రులు అక్కడే వేచి ఉండడంతో రోడ్‌పై కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీనికి తోడు రోడ్డుపై అదే సమయంలో ఇసుక లారీలు, అటుగా వెళ్లే వాహనాలు తోడవడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

'యూరియా కోసం రైతుల తిప్పలు'

గంగాధర, ఫిబ్రవరి 23 : సరిపడా యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు తిప్పలు పడుతున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో గత పదేళ్లలో యూరియా కొరత రాలేదని, సకాలంలో ప్రభుత్వం సరిపడా యూరియాను సరఫరా చేయడంతో ఇబ్బంది లేకుండా రైతులు కావాల్సిన మేర తీసుకువెళ్లినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 20 ఏండ్ల కిందటి పరిస్థితి మళ్లీ వచ్చిందని, ఆనాటి కాంగ్రెస్ పాలనలో రైతులు ఏవిధంగా యూరియా కోసం సొసైటీల వద్ద చెప్పులు లైన్‌లో పెట్టి ఎదురు చూశారో, ప్రస్తుతం అలాంటి దుస్థితే మళ్లీ రాష్ట్రంలో చూస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు, స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

నా ఆరోగ్యం నిలకడగా ఉంది

- దేవుడి ఆశీస్సులు, గ్రాడ్యుయేట్ ఓటర్ల దీవెనలతో ప్రమాదం నుంచి బయటపడ్డా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు

హాస్పిటల్‌లో మీడియాతో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 23 : తన ఆరోగ్య పరిస్థితి పూర్తి నిలకడగా ఉన్నదని, ఎవరూ ఆందోళన చెందొద్దని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవుడి ఆశీస్సులు, గ్రాడ్యుయేట్ ఓటర్ల దీవెనలతో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డానని చెప్పారు. ఫోన్‌లో అందుబాటులో లేకపోతున్నానని, ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అండగా ఉండాలని కోరారు. పూర్తిగా కోలుకున్న వెంటనే అందరినీ నేరుగా వచ్చి కలుస్తానని చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి, తన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సైకిల్‌పై ప్రచార యాత్ర

చిగురుమామిడి, ఫిబ్రవరి 23: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పిడిశెట్టి రాజు మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఆదివారం సైకిల్‌పై ప్రచార యాత్ర చేపట్టారు. దివంగత మాజీ ఎమ్మెల్యే దేశిని మల్లయ్య విగ్రహం వద్ద నివాళులర్పించి ప్రచార యాత్ర ప్రారంభించారు. సైకిల్‌పై ఉత్తర తెలంగాణలోని అన్ని జిల్లాల్లో యాత్ర నిర్వహించనున్నట్లు రాజు తెలిపారు. ఓటర్లను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరనున్నట్లు చెప్పారు.


నవాబుపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిగురుమామిడి, ఫిబ్రవరి 23: నవాబుపేట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 - 2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత తిరిగి ఒక్కచోట కలిసిన చిన్ననాటి స్నేహితులు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. విద్యాబోధన చేసిన గురువులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు నాటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మతతత్వ పార్టీ బీజేపీని ఓడించాలి'

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 23: కేంద్రంలో మతతత్వ పార్టీ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి దేశంలో మత అల్లర్లు పెరిగాయని, ప్రజల మధ్య విద్వేషాలు పెంచి పోషిస్తున్న బీజేపీని పట్టభద్రుల ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్, బండారి రవికుమార్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో 12 జిల్లా కార్యదర్శులతో కలిసి నగరంలోని ప్రెస్ భవనంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీని గెలిపిస్తే దేశాన్ని ప్రైవేటీకరణ దిశగా తీసుకువెళ్తున్న కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లు అవుతుందన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని ఓడించడం కోసం కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నగర కార్యదర్శి గుడికందుల సత్యం, జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్, బీమాసాహెబ్ పాల్గొన్నారు.

పాప జన్మిస్తే ఐదు మొక్కలు నాటించాలి

- డీఆర్‌డీవోలకు కేంద్రం ఆదేశాలు

కలెక్టరేట్, ఫిబ్రవరి 23: దేశంలో ఏటేటా అమ్మాయిల సంఖ్య తగ్గుతుండడంతో, అబ్బాయిలతో సమాన నిష్పత్తిలో ఆడపిల్లల శాతాన్ని పెంచేందుకు కేంద్రం కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. అమ్మాయి జన్మిస్తే ఆ కుటుంబ సభ్యులతో ఐదు మొక్కలు నాటిస్తూ, వాటి మాదిరిగానే చిన్నారిని సంరక్షించుకునేలా అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు కూడా రూపొందించి, సెర్ప్‌కు పంపినట్లు తెలుస్తున్నది. అక్కడి నుంచి సీఈవో ద్వారా డీఆర్‌డీవో కార్యాలయానికి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా మూఢ నమ్మకాలు, అనేక ఇతరత్రా కారణాలతో భ్రూణహత్యలు సాధారణమయ్యాయి. దీంతో, అమ్మాయిల సంఖ్య క్రమేపి తగ్గుతున్నట్లు గుర్తించి, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో అధికంగా అవగాహన పెంచాలనే ఆదేశాల మేరకు అమ్మాయి పుట్టిన ఇంటి కుటుంబ సభ్యులతో ఐదు మొక్కలు నాటించే కార్యక్రమం నిర్వహించాలని గ్రామీణాభివృద్ధి శాఖకు అందిన ఉత్తర్వుల్లో స్పష్టమైన సూచనలిచ్చినట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఈకార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసేందుకు ఆయా మండలాల్లోని ఏపీవోలు, మండలపరిషత్ అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు సిబ్బంది చెబుతున్నారు. అమ్మాయి పుట్టిన కుటుంబాలకు సమీపంలో గల ఖాళీ స్థలాల్లో ఈ మొక్కలను నాటించేలా చర్యలు తీసుకోవాలని సూచనలివ్వగా, ఇందుకవసరమయ్యే ఖర్చుకు అవసరమైన నిధులు ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేయనున్నట్లు డీఆర్‌డీవో వర్గాలు వెల్లడించాయి.

పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 23: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పట్టభద్రులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాల పట్టభద్రులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానికుడినైన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, ఏఐఎస్ఎఫ